andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.6, కనిష్ఠం 29.8
నిర్మల్
జిల్లా వార్తలు
బుధవారం 1 మే 2024





కేక్ కట్ చేస్తున్న కలెక్టర్

కలెక్టర్‌ను శాలువాతో సత్కరిస్తున్న డీఈవో డాక్టర్ రవీందర్‌రెడ్డి

పదిలో జిల్లా ఫస్ట్



పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు

- రెండోసారి కూడా రాష్ట్రంలో మొదటి స్థానమే
- పకడ్బందీ ప్రణాళికతోనే లక్ష్య సాధన
- కలెక్టరేట్‌లో సంబరాలు
- కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు

నిర్మల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎస్ఎస్‌సీ 2024 పరీక్షా ఫలితాల్లో 99.5 శాతం ఉత్తీర్ణతతో నిర్మల్ జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. 2023లో జరిగిన ఎస్ఎస్‌సీ ఫలితాల్లో కూడా నిర్మల్ జిల్లా స్టేట్ ఫస్ట్ సాధించిన సంగతి తెలిసిందే. రెండోసారి కూడా నిర్మల్ జిల్లా తన మొదటిస్థానాన్ని పదులపరుచుకుంది. కాగా 2022 సంవత్సరంలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచింది. ఇదిలా ఉండగా నిర్మల్ జిల్లాలో అన్ని మేనేజ్మెంట్ స్కూల్స్ కలుపుకొని మొత్తం 271 ఉండగా ఇందులో నుంచి 230 స్కూల్స్ పదో తరగతి పరీక్షలకు హాజరయ్యాయి. కాగా మొత్తం 8,908 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 8,823 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. కాగా ఇందులో నుండి 4,226 మంది బాయ్స్, 4,577 మంది గర్ల్స్ ఉన్నారు. మొత్తం 85 మంది విద్యార్థులు జిల్లావ్యాప్తంగా ఫెయిల్ అయ్యారు. బాలురు 98.74 శాతం, బాలికలు 99.33 శాతం ఉత్తీర్ణతతో జిల్లా మొత్తం ఉత్తీర్ణత శాతం 99.5తో అగ్రభాగాన నిలిచింది. కాగా మొత్తం 333 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. దీంతోపాటు 154 స్కూల్స్ 100 శాతం పాస్ రిజల్ట్ సాధించాయి.

ఫలితాల్లో రాణించిన గవర్నమెంట్ పాఠశాలలు

కాగా ఈసారి అన్ని గవర్నమెంట్ మేనేజ్మెంట్ స్కూల్స్ ఎస్ఎస్‌సీ పరీక్షా ఫలితాల్లో రాణించాయి. మొత్తం 166 ప్రభుత్వ పాఠశాలలకు గాను 165 పాఠశాలలకు చెందిన 6 వేల 37 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 5 వేల 964 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కేవలం 73 మంది విద్యార్థులు మాత్రమే ఫెయిల్ అయ్యారు. మొత్తం గవర్నమెంట్ స్కూల్స్‌లో 98.79 శాతం ఉత్తీర్ణత సాధించాయి. 95 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించగా 126 స్కూల్స్ 100 శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధించాయి. ఇలా ఉండగా 64 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 2 వేల 828 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2 వేల 821 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. అలాగే 238 మంది 10 జీపీఏ సాధించి రికార్డు సృష్టించారు.

బాలురు.. బాలికలు సమ ఫలితాలు

జిల్లాలో గవర్నమెంట్ స్కూల్స్‌లో మొత్తం గర్ల్స్ 99.12 శాతం, బాయ్స్ 98.79 శాతం ఉత్తీర్ణత సాధించారు. గవర్నమెంట్ స్కూల్స్ ప్రైవేట్ స్కూల్స్‌ని కలుపుకొని మొత్తం గర్ల్స్ 99.33 శాతం, బాయ్స్ 99.33 శాతంతో కలుపుకొని ఓవరాల్‌గా 99.05 శాతంతో జిల్లా రాష్ట్రంలో మొదటిస్థానం దక్కించుకుంది.

పక్కా ప్రణాళికతో..

గత సంవత్సరం రికార్డును మళ్లీ ఈసారి కూడా నిలబెట్టుకోవాలన్న లక్ష్యంతో డీఈవో రవీందర్‌రెడ్డి ఎస్ఎస్‌సీ పరీక్షల కోసం పకడ్బందీగా ప్రణాళిక రూపొందించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తోడ్పాటుతో ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి శ్రమించారు. ఉపాధ్యాయులు, ఆయా సంఘాల తోడ్పాటుతో సిలబస్ ప్రణాళిక బద్ధంగా పూర్తయ్యేలా చూసుకున్నారు. పరీక్షల్లో అడ్డదారులుండవని చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉన్న వనరులను పూర్తిసాయిలో వినియోగించుకున్నారు. డీఈవో పరీక్షలకు 45 రోజులు ముందుగా ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌కు రూపకల్పన చేశారు. ముఖ్యం గా ఎస్ఎస్‌సీ విద్యార్థుల హాజరుశాతం పెంపుపై ప్రత్యేకదృష్టి సారించారు. ఓవైపు హాజరు శాతం పెంచుతూనే డిసెంబరు నాటికే మొత్తం సిలబస్ పూర్తయ్యేట్లు ఆయన చర్యలు తీసుకున్నారు. కాగా సబ్జెక్టుల ఆరీగా రిపిటేషన్ నిర్వహిస్తూ ప్రతీరోజు ఆ రోజు చదివిన సబ్జెక్టుల వారీగా స్లిప్ టెస్టులను నిర్వహించే ప్లాన్ రూపొందించారు. దీంతోపాటు రెండు ప్రీ ఫైనల్ పరీక్షలను కూడా నిర్వహించారు. కాగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ చేపట్టారు. ఇలాంటి పకడ్బందీ యాక్షన్‌ప్లాన్‌తో నిర్మల్ జిల్లా మరోసారి స్టేట్ ఫస్ట్‌గా నిలిచింది.

కలెక్టరేట్‌లో సంబరాలు

నిర్మల్ జిల్లా రెండోసారి ఎస్ఎస్‌సీ పరీక్షా ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ సాధించడంతో ఇక్కడి కలెక్టరేట్ ఆవరణలో సంబరాలను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్, డీఈవో రవీందర్‌రెడ్డిలతో పాటు విద్యాశాఖ అధికారులు, వివిధ టీచర్ సంఘాల ప్రతినిధులు ఈ సంబరాల్లో పాల్గొన్నారు. కలెక్టర్ కేక్ కట్ చేసి డీఈవోకు తినిపించారు. అనంతరం డీఈవోను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్, డీఈవోలు మాట్లాడుతూ... ఎస్ఎస్‌సీ రిజల్ట్స్‌లో నిర్మల్ జిల్లాను మొదటి వరుసలో నిలపడంలో కృషి చేసిన టీచర్లందరికీ అలాగే కష్టపడి ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఇది ఉమ్మడి కృషి అని వారు కొనియాడారు. భవిష్యత్తులో జిల్లా విద్యారంగాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు సమిష్టిగా, సమన్వయంగా కృషి చేయాలని పలువురు ప్రముఖులు అభినందనలలో తెలిపారు. ఈ ఫలితాలు జిల్లా విద్యారంగానికి గర్వకారణమన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మహారాష్ట్ర ఎమ్మెల్యే



అమ్మవారి సన్నిధిలో ప్రసాదాన్ని అందుకుంటున్న మహారాష్ట్ర ఎమ్మెల్యే

బాసర, ఏప్రిల్, 30 : బాసర సరస్వతీ అమ్మవారిని మహారాష్ట్ర గడ్చిరోలి ఎమ్మెల్యే డా.దేవురావు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్నాల సాయినాథ్, బీజేపీ మండల ప్రెసిడెంట్ కిశోర్‌దేశాయ్ ఆహ్వానించారు. అమ్మవారిని దర్శించుకొని ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు నిర్వహించారు. నరేంద్రమోడీ ప్రధాన మంత్రి కావాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 30 : శ్రీగిరిక్షేత్రంలోని శ్రీవల్లిదేవి సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం మంగళవారం అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గురుస్వామి శనిగారపు చిన్నయ్య, భక్తులు పాల్గొన్నారు. కావడి నిర్వహించారు. అన్నదానం చేశారు.

'పది' ఫలితాల పట్ల ఎమ్మెల్యే హర్షం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 30 : పదోతరగతి ఫలితాల సాధనలో జిల్లా అగ్రస్థానంలో నిలవడం పట్ల బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులను అభినందించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో, అభయహస్తంలో ప్రకటించిన విద్యాజ్యోతుల పథకం వెంటనే అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 15 వేలు, 10 వేల చొప్పున ఇంటర్, టెన్త్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించాలన్నారు.

మాజీ మంత్రి అల్లోల శుభాకాంక్షలు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 30 : పదోతరగతి ఫలితాల్లో నిర్మల్ జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలవడం పట్ల మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇది విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారుల సమిష్టి కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే సాధ్యమైందని, వారికి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. చదువుల తల్లి సరస్వతీదేవి కొలువుదీరిన నిర్మల్ రాష్ట్రంలోనే అగ్రభాగాన నిలవడం సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని, విద్యార్థులు కష్టపడి చదివి జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు.

ఘనంగా ముగిసిన అఖండ హరినామ సప్తాహం



తానూర్, ఏప్రిల్ 30 : మండలంలోని బెంబర్ గ్రామంలో గత ఏడు రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమాన్ని 20ఏళ్లుగా ప్రతీ ఏటా నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా బ్రహ్మ ముహూర్తాన స్వామి వారికి కాఖడ హారతితో పాటు ప్రత్యేక పూజలు చేశారు. మహారాష్ట్రకు చెందిన యోగేష్ మహారాజ్ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహాన్నదనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దిగంబర్ గురూజీ, శంకర్‌పటేల్ మహారాజ్, కాశీనాథ్ మహారాజ్, మాజీ సర్పంచ్ బాలాజీ, మాజీ ఉప సర్పంచ్ శంకర్, నాయకులు లక్ష్మణ్, గ్రామస్థులు తదితరులున్నారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

దిలావర్‌పూర్, ఏప్రిల్ 30 : అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మంగళవారం మండలంలో ఆకస్మిక తనిఖీలతో అధికారులను హడలెత్తించాడు. సిర్గాపూర్, న్యూలోలం గ్రామాల్లో చేపడుతున్న నర్సరీ, ప్లాంటేషన్, సెగ్రిగేషన్ షెడ్ మొదలైన పలు అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా సరైన చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలు వంద శాతం పెరిగేలా చూడాలన్నారు. నాణ్యతతో కూడిన మొక్కలను పెంచాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పని ప్రదేశంలో నీడ, నీరు, ప్రథమ చికిత్సకు సంబంధించిన మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను కూలీలకు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అజీజ్ ఖాన్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో దివ్య రెడ్డి, ఐకేపీ ఏపీఎం సులోచన, పంచాయతీ కార్యదర్శులు నగేష్, శ్రావణ్, ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉన్నారు.



సిర్గాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

2న మామిడి ఫలసాయం బహిరంగ వేలం

ముథోల్, ఏప్రిల్ 30 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ముద్గల్‌లోని ప్రభుత్వ నర్సరీలో ఈ నెల 2న మామిడి చెట్ల పంటను బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు నిర్మల్ జిల్లా ఉద్యాన వన పట్టు పరిశ్రమ అధికారి ఆలిమా ఫాతిమా ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ. 5 వేల ధరావత్తు చెల్లించి పాల్గొనాలన్నారు. బహిరంగ వేలంలో ఎక్కువ మొత్తం బిడ్ పెట్టిన వారికి మాత్రమే వేలం అనుమతించవచ్చన్నారు. వేలంలో నెగ్గిన వారు పాట మొత్తంలో సగం సొమ్మును వెంటనే చెల్లించాలన్నారు. పూర్తి సొమ్ము 10-05-2024కు చెల్లించాలన్నారు. మామిడి వేలం కాల పరిమితి 10 జూన్ 2024 ముగిస్తుందన్నారు. వేలంపాట ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

లక్ష్మణచాంద మండలంలో ఒక్కరికీ రాని 10 జీపీఏ

లక్ష్మణచాంద, ఏప్రిల్ 30 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఏ ఒక్క విద్యార్థికి 10 జీపీఏ రాలేదు. సెకండరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ మంగళవారం విడుదల చేసిన ఫలితాలను అనుసరించి ఎంఈవో మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం... కస్తూర్బాగాంధీ పాఠశాలకు సంబంధించి జి. గ్రీష్మ 9.5, ఎం. వర్ష 9.3 జీపీఏ సాధించి పాఠశాల టాపర్స్‌గా నిలిచారు. ఈ పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించింది. లక్ష్మణచాంద జడ్పీహెచ్ఎస్‌కు సంబంధించి తేజశ్రీ 9.5, సిద్ధార్థ 9.2 జీపీఏ సాధించి ఈ పాఠశాలలో టాపర్స్‌గా నిలిచారు. ఈ పాఠశాల కూడా 100 శాతం ఉత్తీర్ణత సాధించింది. వడ్యాల్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన అమ్ముల్య 9.3, రాజశ్రీ 9.3 జీపీఏలు సాధించి టాపర్స్‌గా నిలవగా ఈ పాఠశాల 98 శాతం ఉత్తీర్ణత సాధించింది. బాబాపూర్ జడ్పీహెచ్ఎస్‌కు సంబంధించి చింతా సాయిచరణ్ 9.2 జీపీఏ సాధించి టాపర్‌గా నిలువగా ఈ పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించింది. మల్లాపూర్ జడ్పీహెచ్ఎస్‌కు సంబంధించి మృదుల 9.2, అక్షయ 9.0 జీపీఏ సాధించి టాపర్స్‌గా నిలిచారు. మల్లాపూర్‌కు చెందిన మరో బాలిక బోడ దీప్తి మాధురి 9.8 గ్రేడ్ సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచింది.

మైక్రో అబ్జర్వర్లు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

- జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 30 : పార్లమెంట్ ఎన్నికల విధుల్లో సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్స్) అప్రమత్తంగా తమ విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సూక్ష్మ పరిశీలకులకు ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...



హాజరైన అధికారులు

ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమైందని తెలిపారు. పోలింగ్ రోజు మాక్‌పోల్ నిర్వహించేటప్పుడు ప్రతి చిన్న అంశాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అనధికార వ్యక్తులు ఎవరూ కూడా పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాక్ పోలింగ్ నిర్వహించిన తర్వాత రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీఆర్‌సీ ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతనే పోలింగ్ ప్రక్రియను చేపట్టాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు 200ల మీటర్ల లోపు ఎటువంటి రాజకీయ పార్టీల ప్రచారాలకు సంబంధించిన పోస్టర్లు ఉండకుండా చూడాలని తెలిపారు. ఎన్నికల అధికారుల ఫోన్ నెంబర్లతో కూడిన సమాచారాన్ని ఫ్లెక్సీల రూపంలో పోలింగ్‌కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్‌కు సంబంధించి అన్ని అంశాలను రిజిస్టర్‌లలో పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. అన్ని రిపోర్టులను సకాలంలో అందజేయాలని ఆదేశించారు. అనంతరం సూక్ష్మ పరిశీలకులకు మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్ ఈవీఎంల నిర్వహణ, ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్‌వో భుజంగరావ్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్- 1 పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఎం. మహేందర్‌రెడ్డి

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 30 : జూన్ 9వ తేదీన నిర్వహించబోయే గ్రూప్- 1 పరీక్షకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఎం. మహేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని టీఎస్‌పీఎస్సీ ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మే 10వ తేదీ లోపు పరీక్షా కేంద్రాలను ఎంపిక చేయవలసిందిగా ఆదేశించారు. ఆర్డీవో లేదా ఆ స్థాయి అధికారులు ప్రత్యక్షంగా అన్ని జిల్లాల్లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ గల ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, కాంపౌండ్‌వాల్, మరుగుదొడ్లలో నీటిలభ్యత వంటి సౌకర్యాలు తనిఖీ చేసి పరీక్షా కేంద్రాలను ఎంపిక చేయాలని తెలిపారు. గ్రూప్- 1 పరీక్షను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి మూడు నుంచి ఐదు పరీక్షా కేంద్రాలకు కలిపి ఒక తహసీల్దార్ స్థాయి అధికారిని ఫ్లయింగ్ స్క్వాడ్‌గా నియమించాలని ఆదేశించారు. పరీక్షల విధులు నిర్వహించే ప్రతి అధికారికి కనీసం పరీక్షకు మూడు రోజుల ముందు అవగాహన కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ఆర్టీసీ అధికారులతో చర్చించి పరీక్ష రోజు అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరిపడినన్ని ప్రత్యేక బస్సులను నడపాలని సూచించారు. పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు ఎవరైనా అనారోగ్యానికి గురైనట్లయితే ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అత్యవసర మందులు ఏఎన్ఎం, స్టాఫ్ నర్స్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష నిర్వహణలో పోలీసుశాఖ వారు పరీక్షా కేంద్రాల వద్ద రెండంచెల భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. ఈసారి పరీక్ష నిర్వహణలో బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టినందున పోలీసుశాఖ వారు ఒక పోలీస్ బయోమెట్రిక్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ పోలీస్ బయోమెట్రిక్ ఆఫీసర్‌ను నియమించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఒక సబ్ ఇన్స్‌పెక్టర్ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించాలని ఆదేశించారు. ఆ తర్వాత ఈసారి పరీక్షలో నూతనంగా ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ విధానంపై టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ... జిల్లాలో పరీక్ష నిర్వహణకై అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్న కళ్యాణ, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎస్పీ గంగారెడ్డి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు

సంక్షిప్త సమాచారం

తునికాకు సేకరణకు వెళ్లి వ్యక్తి మృతి



బక్కన్న మృతదేహం

దస్తూరాబాద్, ఏప్రిల్ 30 : తునికాకు సేకరణకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కడెం మండలంలోని అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే దస్తూరాబాద్ మండలం దేవునిగూడెం గ్రామానికి చెందని మోకిరాల బక్కన్న(61) అనే వ్యక్తి గత ఆదివారం తునికాకు సేకరణ కోసం కడెం మండలం గంగాపూర్ అటవీ ప్రాంతానికి వెళ్లాడు. కాగా భోజనం సమయంలో మీరు అని చెప్పి తునికాకు సేకరణ కొరకు అడవిలోకి వెళ్లాడు. తోటి వ్యక్తులు ఎంత పిలిచినా బక్కన్న రాకపోయేసరికి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు గత రెండు రోజులుగా అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో అల్లంపెల్లి సమీపంలోని అటవీప్రాంతంలో మృతదేహం లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని కడెం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడు బక్కన్న వడదెబ్బతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఇద్దరిపై కేసు నమోదు

నర్సాపూర్(జి), ఏప్రిల్ 30 : డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావ్‌పై ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లో గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా సామాజిక మాధ్యమంలో పోస్టులు చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వసూల్‌రాజా అన్న నినాదంతో తీవ్ర పదజాలంతో పాట మ్యూజిక్‌తో టెంబుర్ని గ్రామానికి చెందిన ఏలేటి శ్రీకాంత్‌రెడ్డి, కాల్వ గ్రామానికి చెందిన ఆమెడ శ్రీకాంత్‌రెడ్డిలు సామాజిక మాధ్యమంలో పోస్టులు చేశారు. దీనిపై జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అడ్వైజర్ పి. రమేశ్‌కుమార్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 504,505(2) సెక్షన్‌లతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలోకి పలువురి చేరిక

నర్సాపూర్(జి), ఏప్రిల్ 30 : మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం అదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నుంచి ముఖ్య నాయకులు యంపీపీ కొండ్ర రేఖారమేష్, యంపీటీసీ మంగ్లారపు మల్లేష్, వార్డు సభ్యులు, గ్రామ ప్రెసిడెంట్ సాగర్, కుప్లి, అంజనీ గ్రామ నాయకులు అదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ, డీసీసీ అధ్యక్షుడుకూచాడి శ్రీహరిరావ్ ఆధ్వర్యంలో భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు, మండల కాంగ్రెస్ నాయకులు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, అజీమ్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

పది ఫలితాల్లో మెరిసిన ముధోల్ విద్యార్థులు

● 12 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత

ముధోల్, ఏప్రిల్ 30 : పదవతరగతి ఫలితాల్లో ముధోల్ మండలంలోని 6 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 4 ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించి మంచి ప్రతిభ కనబరిచారు. మండలంలోని ఎడ్‌బిడ్, బోరిగాం, ఆష్ట, మచ్కల్, ముధోల్ ప్రభుత్వ ఉన్నత, బాలికల తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే బాలుర గురుకుల, ఆశ్రమ పాఠశాల, బాలికల గిరిజన పాఠశాల, కస్తూరిబా, మహాత్మా జ్యోతి బాపూలే, బాలికల మైనార్టీ పాఠశాలతో పాటు రబింద్ర, శిశు మందిర్ పాఠశాలలు వంద శాతం పదిలో ఉత్తీర్ణత సాధించగా ముధోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో మైసాజి తెలిపారు. ఆష్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ. మనోహర్ 10 జీపీఏ, కస్తూరిబా గాంధీ పాఠశాలలో జే. ప్రియాంక 10 పీజీఏ సాధించారు. మచ్కల్ ఉన్నత పాఠశాలలో సాయిచరణ్, సుజాత అనే విద్యార్థులు 9.7 జీపీఏ, బాలికల మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలలో దివ్య, ఐశ్వర్య, మాధవి అనే విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. అలాగే ముధోల్‌లోని రబింద్ర పాఠశాలలో 10 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మొత్తం 15కు గాను 14 పాఠశాలలు పది ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో ఉపాధ్యాయులు, పోషకులు విద్యార్థులను అభినందించారు. మొత్తం మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 99.84 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

దిలావర్‌పూర్‌లో..

మండలంలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తం 211 మంది విద్యార్తులు పదోతరగతి పరీక్ష రాయగా.. 211 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కస్తూర్బాగాంధీ విద్యాల యానికి చెందిన 29 మంది విద్యార్థులను 29 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా వీరిలో ఒకరు 10 జీపీఏ, 9 జీపీఏ పైగా 16 మంది విద్యార్థులు, 8 జీపీఏకు పైగా 9 మంది, 7 జీపీఏ పైగా ముగ్గురు విద్యార్థులు సాధించారు. అలాగే దిలావర్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులకు 45 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో హైయెస్ట్ 9 జీపీఏ వచ్చింది. గుండంపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 21 మంది విద్యా ర్థులకు 21 మంది ఉత్తీర్ణులు కాగా 9 హైయెస్ట్ జీపీఏ వచ్చింది. బన్సపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులకు 20 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాల విద్యార్థులకు 8.8 జీపీఏ వచ్చింది.

కుంటాల మండలంలో వందశాతం ఉత్తీర్ణత

కుంటాల, ఏప్రిల్, 30: కుంటాల మండలంలో మంగళవారం వెలువడిన పదవతరగతి ఫలితాల్లో మండలంలో వంద శాతం ఉత్తీర్ణత శాతం సాధించినట్లు ఎంఈవో ముత్యం తెలిపారు. కల్లూర్ హైస్కూల్‌లో 100 శాతం, లింబా (కే) హైస్కూల్‌లో వందశాతం, ఓలా తెలుగు మీడియంలో 100 శాతం, ఓలా ఉర్దూ మీడియంలో 92 శాతం, కల్లూర్ కస్తుర్బా పాఠశాలలో 100 శాతం, కుంటాల ఆదర్శ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

రూ.37 లక్షల విలువ గల గంజాయి కాల్చివేత

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ● 19 కేసుల్లో పట్టుబడిన 150 కేజీల గంజాయి ● డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం





గంజాయిని దహనం చేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ

తలమడుగు, ఏప్రిల్ 30: జిల్లాలోని 11 పోలీసు స్టేషన్‌లో నమోదైన 19 కేసుల్లో వివిధ సందర్భాల్లో నిందితుల వద్ద నుంచి సీజ్ చేసిన మొత్తం 150 కిలోల నిషేధిత గంజాయిని తలమడుగు మండలం మండలం సుంకిడి గ్రామ శివారులో నిర్మాణ అటవీ ప్రాంతంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. అయితే దహనం చేసిన నిషేధిత గంజాయి విలువ సుమారుగా రూ.37లక్షల విలువ ఉంటుందని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఛైర్మన్‌గా జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఐపీఎస్, సభ్యులుగా ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి, వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, డీఎస్పీ కె.సురేందర్‌రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కోర్టు అనుమతి తీసుకుని ఈ నిషేధిత గంజాయిని సాయంత్రం దహనం చేయడం జరిగిందని తెలిపారు. ముందుగా జిల్లా ఎస్పీ ఈ గంజాయిని కేసుల వారీగా పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లోని నియమ నిబంధనల ప్రకారం జిల్లాలోని పలు పోలీసు స్టేషన్‌ల్లో నిల్వ ఉన్న గంజాయిని దహనం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మత్తు పదార్థాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు. ఇందులో అదనపు ఎస్పీ ఆపరేషన్ కె.సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో తగ్గని భానుడి భగభగలు

● బేలలో 43.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు



ఎండల తీవ్రతకు మొహానికి గుడ్డ ధరించి వెళ్తున్నారిలా..

ఆదిలాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో భానుడి భగభగలకు ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. గత కొద్ది రోజులుగా జిల్లావ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎండల తీవ్రత కనిపిస్తుంది. మంగళవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 42.3 డిగ్రీలు కాగా కనిష్టంగా 27.2 డిగ్రీలు నమోదయ్యాయి. అత్యధికంగా బేల మండలం చప్రాలలో 43.3 డిగ్రీలు నమోదు కాగా తాంసి మండలంలో 43.0, భీంపూర్ మండలం అర్లి(టి)లో 42.7, బోథ్‌లో 42.0, జైనథ్‌లో 41.7, ఉట్నూర్‌లో 41.0, ఇచ్చోడలో 40.8 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గాదిగూడ, బజార్‌హత్నూర్ మండలాల్లో 40 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండిపోతున్న ఎండలతో జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ముఖ్యంగా ఉపాధి కూలీలు పనులకు వెళ్లేందుకు వెనుకాడుతున్నారు. దీంతో ఉపాధి కూలీల సంఖ్య భారీగా పడిపోతుంది. రైతులు ఉదయం సాయంత్రం వేళల్లోనే వ్యవసాయ పనులను ముగించుకుని మధ్యాహ్నం సమయంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. పలు గ్రామాల్లో సాగునీటితో పాటు తాగునీటి ఎద్దడి తీవ్రంగా కనిపిస్తుంది. మునుపెన్నడు లేని విధంగా ఏప్రిల్ నెలలోనే ఎండలు విపరీతంగా మండిపోతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మే మాసంలో ఎండల తీవ్రత మరింతగా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పలువురు వడదెబ్బ బారీనపడి అస్వస్థతకు గురైన దాఖలాలు ఉన్నాయి. మరికొన్నాళ్ల పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.





ఎండల తీవ్రతకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా మారిన రోడ్లు

పదిలో సత్తా చాటిన గురుకులం బాలికలు

బోథ్, ఏప్రిల్ 30: మంగళవారం విడుదలైన పదవ తరగతి ఫలితాలు మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులతో పాటు పలు పాఠశాలల విద్యార్థులు సత్తా చాటుకున్నారు. పొచ్చెర, కౌటా(బి), పాట్నాపూర్, కనుగుట్ట, బోథ్ ఉర్దూ పాఠశాల పార్డీ(బి) పాఠశాలలకు చెందిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా తెలంగాణ మోడల్ స్కూల్ ఎస్టీ బాలికల పాఠశాల ప్రైవేట్ పాఠశాలలైన విజ్ఞాన్ సెంట్ థామస్, నాగభూషణం పాఠశాలలో వంద శాతం ఫలితాలు రావడం జరిగింది. మరలపెల్లి పాఠశాలలో 80 శాతం ఫలితాలు రాగా దన్నూర్ పాఠశాలలో 87 శాతం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 88 శాతం ఫలితాలు సాధించాయి. అయితే మండల వ్యాప్తంగా సాధించిన ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది.

గుడిహత్నూర్: మంగళవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్షల్లో మండల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన జాయ్‌బాయ్ సాక్షి 9.7 గ్రేడ్ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. జి.నిఖిత 9.3, జి.రింకల్ 9.2 గ్రేడ్ సాధించారు. మండలంలోని పునగూడ కేజీబీవీకి చెందిన పౌర్ణిమ 9.0, గుడిహత్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పి.దివ్య, పి.నందిని, తోషం ఆశ్రమ పాఠశాల విద్యార్థి కొడప మహేష్ 8.0 గ్రేడ్ సాధించారని ఎంఈవో నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.



బోథ్ 10 జీపీఏ సాధించిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు



గుడిహత్నూర్ విద్యార్థులు సాక్షి, రింకల్, నిఖిత

కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రామ్‌లో 126 వాహనాల సీజ్



స్వాధీన పరుచుకున్న ద్విచక్ర వాహనాలు



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ సీఐ రాజారెడ్డి

భైంసా, ఏప్రిల్ 30 : పట్టణ పరిధిలోని ఓవైసీనగర్ కాలనీలో మంగళవారం పోలీసు శాఖ కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం చేపట్టింది. టౌన్ సీఐ రాజారెడ్డి నేతృత్వంలో 60 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది కాలనీ పరిధిలో ఇంటింటా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరియైన ధృవీకరణ పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 112 ద్విచక్ర వాహనాలు, 13 ఫోర్ విల్లర్స్, ఒక ఫోర్ విల్లర్ వాహనాన్ని కలిపి మొత్తం 126 వాహనాలను పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం సందర్భంగా కాలనీవాసులతో టౌన్ సీఐ రాజారెడ్డి సమావేశం నిర్వహించి మాట్లాడారు. తల్లితండ్రులు తమ తమ మైనర్ పిల్లలకు నడిపేందుకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒకరు పోలీసుశాఖకు సహకరించాలన్నారు. సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసుశాఖ సమాచారం అందివ్వాలన్నారు.ఇందులో టౌన్ ఎస్‌ఐలు షరీఫ్, గౌస్, నారాయణ సింగ్‌తో పాటు పట్టణ పోలీసులు, టీఎస్‌ఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

కుభీర్, ఏప్రిల్ 30 : నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు భైంసా రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని సిర్పెల్లి(హెచ్) గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గ్రామస్థులు కలిసి మెలిసి ఉండాలని, ఏదైన సమస్య ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు. ప్రతీఒక్కరు తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎవరు కూడా రూ.50వేల కంటే ఎక్కువగా నగదుతో ప్రయాణం చేయవద్దని పేర్కొన్నారు. ఈ సర్చ్‌లో భాగంగా సరైన పత్రాలు లేని 56బైకులు, 3ఆటోలను స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రవీందర్, శ్రీకాంత్, రజనికాంత్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులున్నారు.



సిర్పెల్లి(హెచ్)లో పోలీసులు పట్టుకున్న వాహనాలు

భైంసాలో 28 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత

భైంసా, ఏప్రిల్ 30: పది పరీక్షా ఫలితాల్లో భైంసా పట్టణ, మండల పరిధిలోని 36 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 28 పాఠశాలలు శత శాతం ఉత్తీర్ణత సాధించాయి. పది పరీక్షలకు 714 మంది బాలికలు, 764 బాలురు కలిపి మొత్తం 1478 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 706 మంది బాలికలు, 759 మంది బాలురు కలిపి 1465 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 8 మంది బాలికలు, 5 మంది బాలురు కలిపి మొత్తం 13 మంది విద్యార్థులు అనుత్తీర్ణులయ్యారు. పట్టణ, మండల పరిధిలో మొత్తం 99.12 ఉత్తీర్ణత శాతం నమోదు అయ్యింది.



నగదు వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఎస్‌టీ టీం అధికారి జ్ఞానేందర్‌షా

పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా చెక్‌పోస్టు వద్ద రూ.లక్షా 22వేల నగదు పట్టివేత

జైనథ్, ఏప్రిల్ 30: ఆదిలాబాద్ జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా చెకపోస్టు వద్ద మంగళవారం ఉదయం ఎస్ఎస్‌టీ టీం మేజిస్ట్రేట్ అధికారి జ్ఞానేందర్ షా ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని వర్ధ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు (సీజీ04ఎన్‌జీ9001)ను తనిఖీ చేయగా అందులో రూ.లక్షా22వేలను స్వాధీనం చేసుకున్నారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి రషీదులు లేకపోవడంతో కారు యజమాని అంకిత్‌సింగ్‌నిపై కేసు నమోదు చేశారు. ఈ డబ్బును డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ కమిటీ ఎస్‌బీఐ ఖాతాలో జమ చేసినట్లు ఎస్ఎస్‌టీ టీం అధికారి జ్ఞానేందర్‌సీ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఎస్సై రమణమూర్తి, ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ నాందేవ్, పీసీ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఏఐసీసీ జాయినింగ్ కమిటీ సభ్యులు

సీనియర్ నాయకులపై సస్పెన్షన్ ఎత్తివేత

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 30: ఏఐసీసీ జాయినింగ్ కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఏఐసీసీ జాయింట్ కమిటీ సభ్యులు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, ఆలిండియా కిసాన్‌సెల్ వైస్ ప్రెసిడెంట్ కోదండరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని సీనియర్ నాయకులు గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్, సంజీవరెడ్డి, భార్గవ్‌దేవ్‌పాండేలపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ తిరిగి పార్టీలోకి తీసుకున్నట్లు మంగళవారం ప్రకటించారు. కాగా వీరు తిరిగి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు తెలుస్తుంది.



బజార్‌హత్నూర్‌లో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

18 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి..

● బజార్‌హత్నూర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 30: బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి కలిసి చదువుకున్న విద్యార్థులు అందరూ.. మంగళవారం 18 ఏళ్ల తర్వాత ఒక వేదికపై కలిశారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితులు అందరు కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేవు. ఆత్మీయంగా పలకరించుకుంటే ఒకరినొకరు వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా కలిసి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్, వెంకటరమణ, రవి, ప్రకాష్, సంజీవ్, ప్రేంసింగ్, అంబరీష్, పూర్వవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై కూలిపోయిన భారీ వృక్షం

నేలకూలిన భారీ వృక్షం.. ట్రాఫిక్ జాం

ఉట్నూర్, ఏప్రిల్ 30: మండలంలోని మంచిర్యాల-ఉట్నూర్ ప్రధాన రహదారిపై ఉన్న బీరుసాయిపేట వద్ద మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు భారీ వృక్షం నేలకూలింది.ఫలితంగా ఈ రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కావడంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఖానాపూర్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం ముగించుకుని ఉట్నూర్‌కు వస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ వెంటనే స్పందించి అధికారులను స్పందించి నేలకూలిన చెట్లను తొలగించే ప్రయత్నం చేయడంతో చెట్లను రాత్రి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



తాంసిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీడీవో

'పోలింగ్ కేంద్రానికి రాని వారికి ఇంటి వద్దకే బ్యాలెట్'

తాంసి, ఏప్రిల్ 30: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేయలేని స్థితిలో ఉన్న వృద్ధులకు ఇంటి వద్దకే బ్యాలెట్ పంపించి ఓటు వేసే అవకాశాన్ని కల్పించామని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పొన్నారి, హస్నాపూర్, తాంసి గ్రామాలలో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని ఓటర్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. గ్రామంలో ఎవరైతే నడవలేని స్థితిలో ఉన్నారో? వారికి ఇంటి వద్ద ఓటు వేసి వెసులుబాటు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకునేలా గ్రామానికి చెందిన యువత సహకరించాలని కోరారు. ఇంటి వద్దకే పోలింగ్ చిట్టి తీసుకువచ్చి తమ సిబ్బంది ఓటు వేయిస్తారని పేర్కొన్నారు. దీంతో వృద్ధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో కారోబార్ సుభాష్, సెక్రటరీ గంగన్న, తదితరులున్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సప్తాహాలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్

బోథ్, ఏప్రిల్ 30: బోథ్ మండలంలోని చింతలబోరి గ్రామంలో మంగళవారం నిర్వహించిన అఖండ హరినామ సప్త కార్యక్రమం స్థానిక శాసన సభ్యుడు జాదవ్ అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాత్మికత కార్యక్రమాల వల్ల మానసిక ప్రశాంతత నెలకొంటుందని అన్నారు. ప్రజలు సన్మార్గంలో నడవడానికి ఆధ్యాత్మికత కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ముండే వినోద్, ఈశ్వర్, సంతోష్‌తో పాటు ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రఘుమన్సింగ్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

మావల, ఏప్రిల్ 30: ఆదిలాబాద్ రూరల్ మండల అంకాపూర్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు అసుర హన్మాండ్లు యాదవ్ మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్‌లు పా ల్గొన్నారు. ఈ మేరకు సన్మాన గ్రహీత అసూర హన్మాండ్లు యాదవ్-విజయ దంపతులను ఘనంగా సన్మానించారు. ఇందులో పలు మండలాల యాదవ సంఘం నాయకులు, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జైత్రంతండాలో హోంగార్డు ఆత్మహత్య


ఉట్నూర్, ఏప్రిల్ 30: మండలంలోని జైత్రంతాండకు చెందిన హోంగార్డు జాదవ్‌నూర్‌సింగ్(42) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. ఇంద్రవెల్లి పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న నూర్‌సింగ్ గత మూడు నెలలుగా తీవ్ర అనారోగ్యానికి గురై ఇంటి వద్ద ఉండడంతో సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఉట్నూర్ ఆసుపత్రికి చేర్చిప్రథమ చికిత్స అనంతరం జిల్లాకేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా అక్కడ వైద్యం అందుకుంటు మంగళవారం మృతి చెందాడని వివరించారు. మృతుడికి భార్యజాదవ్ సులోచనబాయితో పాటు ముగ్గురు సంతానం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

ఉట్నూర్, ఏప్రిల్ 30: ఉట్నూర్ మండలంలోని లక్కేటిపేట ఆశ్రమ పాఠశాల ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ బంకట్‌లాల్ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రైవేట్ పెళ్లిళ్ల కార్యక్రమాలతో పాటలు పాడుతూ కళాకారుల పొట్టగొడుతున్నారని జిల్లా ప్రజా కళాకారుల సంఘం అధ్యక్షుడు మోహన్‌నాయక్ ఆరోపించారు. మంగళవారం ఈ మేరకు ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో డీడీ దిలీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com · మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.8, కనిష్ఠం 27.2



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

1 · బుధవారం 1 మే 2024



ఆదివాసీల మద్దతు.. ఎవరికో?

- ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఆదివాసీలే..
- సొంత సామాజికవర్గం మద్దతుపై నేతల ధీమా
- అండగా నిలిచిన వారికే మద్దతు ఇస్తామంటున్న ఆదివాసీలు
- సామాజికవర్గాల వారీగా లెక్కలు వేసుకుంటున్న అభ్యర్థులు
- లోక్‌సభ పరిధిలో అన్ని పార్టీల చూపు ఆదివాసీల వైపే..



ఆదిలాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల హడావుడి మొదలు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ప్రచారంతో ప్రజల్లోకి దూసుకెళ్తున్నారు. ఈ సారి ఎలాగైనా గెలిచి తీరాలన్న పట్టుతో ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఆదివాసీలే కావడంతో.. ఆ సామాజిక వర్గం ఓటర్ల మద్దతు ఎవరికన్నది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆదివాసీలనే బలంగా నమ్ముకుంటున్నాయి. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ సీనియర్ నేత కావడంతో ఆయనకు అన్ని నియోజకవర్గాలలో అనుచరులు, పరిచయాలు ఉండడంతో కలిసి వస్తుందని అంతా భావిస్తున్నారు. అలాగే ఆదివాసీ ఉద్యమ సమయంలో కీలకంగా వ్యవహరించిన బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు ఆదివాసీల్లో మంచి పట్టు ఉందన్న టాక్ వినిపిస్తోంది. ఇన్నాళ్లు ఉపాధ్యాయురాలిగా పని చేసి కొత్తగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ సేవా కార్యక్రమాలతో ఆదివాసీలకు మరింత దగ్గరయ్యిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో సుమారుగా లక్షా 50వేలకు పైగా ఆదివాసీ ఓటర్లు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఆసిఫాబాద్, ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్ నియో జకవర్గాల్లోనే ఆదివాసీల ఆధిక్యత ఎక్కువగా కనిపిస్తోంది. నిర్మల్, సిర్పూర్, ముథోల్ నియోజకవర్గాలలో మాత్రం ఆదివాసీల ప్రభావం అంతగా ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అత్యధికంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఆదివాసీ ఓటర్లు ఉండగా.. అత్యల్పంగా ముథోల్ నియోజకవర్గంలో ఉన్నట్లు తెలుస్తుంది. ఆదివాసీల మద్దతు తమకే ఉందని అన్ని పార్టీల అభ్యర్థులు చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నా.. గంపగుత్తగా ఏ పార్టీకి ఆదివాసీలు మద్దతునిచ్చే పరిస్థితులు లేవన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

ఎవరి ధీమా వారిదే..

ప్రధాన పార్టీలన్నీ వ్యూహాత్మకంగా ఆదివాసీ అభ్యర్థులను లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిపాయి. దీంతో ఆదివాసీ ఓటర్ల మద్దతుపై ఎవరికి వారే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ గతంలో పార్లమెంట్ సభ్యుడిగా పని చేయడం ఆదివాసీ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారించడంతో ఆయనకు ఆదివాసీలు అనుకూలంగా ఉంటారన్న చర్చ సాగుతోంది. అయితే గోడం నగేష్ ఆదివాసీ ఉద్యమానికి అంటిముట్టనట్లుగా వ్యవహరించడంతో ఆ సామాజికవర్గంలో కొంత అసమ్మతి వ్యక్తమవుతోంది. దీంతో ఆశించిన స్థాయిలో మద్దతు దక్కుతుందో? లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ఆదివాసీల ఉద్యమంలో ఎంపీ సోయం బాపురావు తర్వాత.. కీలకంగా వ్యవహరించి న బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు ఆదివాసీలు కొంత అనుకూలమన్న అభిప్రాయాలు కూడా లేకపోలేదు. సమాజం కోసం పాటుపడిన నేతలకు ఎళ్లవేళలా గుర్తింపు ఉంటుందని ఆదివాసీ సంఘాల నేతలు పలుమార్లు ప్రకటించడం దీనికి బలానిస్తోంది. రాజకీయాలకు కొత్తయిన తన సొంత సామాజికవర్గానికి ఏదో చేయాలన్న తపనతో ఉన్న ఆత్రం సుగుణ.. ఆదివాసీల మద్దతుపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. కానీ ఏమేరకు ఆదివాసీల మద్దతును దక్కించుకుంటారో? వేచి చూడాల్సి ఉంది. మొత్తానికి లోక్‌సభ పరిధిలోని ఆదివాసీ ఓటర్లు ఎవరికి పూర్తిగా మద్దతుగా నిలిచే పరిస్థితులు కనిపించడం లేదు. తలో కొంత ఆదివాసీ ఓటర్ల మద్దతును దక్కించుకుని గిరిజనేతరుల ఓట్లతో గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆదివాసీల్లో అయోమయం

లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతుపై ఆదివాసీల్లో అయోమయం కనిపిస్తోంది. ఎవరికి మద్దతుగా నిలవాలో అర్థంకాని పరిస్థితి ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సోయం బాపురావుకు అండగా నిలిచిన ఆదివాసీలు.. ఈసారి ముగ్గురు అభ్యర్థుల్లో ఎవరికి మద్దతునిచ్చే విషయంపై స్పష్టతనివ్వడం లేదు. ఆదివాసీ సమాజానికి అండగా నిలిచిన వారికే మద్దతుగా నిలుస్తామని చెబుతున్నా.. అంతర్గతంగా మాత్రం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తుంది. ఆదివాసీ సమస్యలకు పరిష్కారం చూపిన పార్టీలకే అండగా ఉంటామని సంఘాల నేతలు ప్రకటిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆదివాసీ నేతలు అన్ని పార్టీలలో కీలకంగానే వ్యవహరిస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. మెజార్టీ ఆదివాసీ ఓట్లను దక్కించుకుని పార్టీలో సత్తా చాటాలన్న ఉద్దేశంతో కొందరు నేతలు ఉన్నట్లు తెలుస్తుంది. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాల్లో ఇద్దరు మాత్రమే ఆదివాసీ ఎమ్మెల్యేలు ఉన్నారు. అలాగే సిట్టింగ్ ఎంపీ కూడా ఆదివాసే కావడంతో ఎవరికి పూర్తిగా మద్దతునిచ్చినట్లు కనిపించడం లేదు. గెలిచిన తర్వాత ఆదివాసీ సమస్యలకు సరైన పరిష్కార మార్గం చూపుతామని అభ్యర్థులంతా చెబుతున్నా.. చివరికి ఆదివాసీలు ఎవరికి అండగా నిలుస్తారో? అంతుచిక్కడం లేదం టున్నారు. అయితే అభ్యర్థులంతా సామాజికవర్గాల వారీగా ఓట్ల లెక్కలు వేసుకుంటూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.





మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

పార్టీల పేరిట విభజించవద్దు : ఆదివాసీలు

ఉట్నూర్, ఏప్రిల్ 30: రాజకీయ పార్టీల పేరుతో ఆదివాసీ గిరిజనులను విభజించవద్దని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేస్రం కొనుపటేల్, గేడం నీరంజన్, ఆత్రం ముకుందరావు, కొడప రాధాబాయిలు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పొచ్చయ్య, బీఆర్ఎస్‌కు అనుబంధంగా ప్రకటనలు చేస్తూ ఆదివాసీ గిరిజనులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ గిరిజనులు ఎవరికి వారు తమ తమ పార్టీలలో ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికి.. ఒకే ఒక పార్టీకి ఓట్లు వేయడానికి ఆదివాసీ గిరిజనులు ముందుకు రావాలని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. 9 తెగలలో ఉన్న ఆదివాసీ గిరిజనులను బీఆర్ఎస్ నాయకులు కొందరు తమ స్వప్రయోజనాల కోసం బీఆర్ఎస్ వైపు ఉన్నారంటూ ప్రకటనలు చేయడం విడ్డూరం అన్నారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి రెండు రోజుల క్రితం బురుస పొచయ్య 9 తెగల ఆదివాసీ గిరిజనులు బీఆర్ఎస్ వైపు ఉన్నారంటూ ప్రకటించడం సరైంది కాదన్నారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలోని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసుకొని కొందరు గిరిజనులు అధికార పార్టీ వైపు ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు అసత్య ప్రకటనలు చేస్తూ ఆదివాసీలను తప్పుతోవ పట్టించే విధంగా ప్రకటనలు చేయడం సరైనది కాదన్నారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు టేకం భీమ్‌రావు, కొడప నగేష్, గొడిసెల భీమన్న, కొద్దుపటేల్, మడావి బాలాజి, రాజేశ్వర్, తదితరులున్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

పది ఫలితాలలో 'ఎస్ఆర్' ప్రభంజనం

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 30: పదవ తరగతి ఫలితాలలో పట్టణంలోని ఎస్ఆర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. కాగా, 10 జీపీఏకు పది జీపీఏ 11 మంది విద్యార్థులు సాధించారు. ఇందులో పి.శ్లోక, సీహెచ్ హరిప్రియ, ఆర్.కావేరి, ఎస్.ద్రివిత, సుమిత్‌రమేష్, ఎన్.విగ్నేష్‌రెడ్డి, జి.ప్రణవి, సీహెచ్ అభిష్టరెడ్డి, ఈ.విశ్వేష్‌రావు, బి.పార్థ్, కె.అక్షర 10 జీపీఏ సాధించారు. 20 మంది విద్యార్థులు 9.8 జీపీఏ, 9.7 జీపీఏతో 27 మంది, 9.5 జీపీఏతో 16 మంది, 9.3 జీపీఏతో 21 మంది, 9.2 జీపీఏతో 28 మంది, 9.0 జీపీఏతో 20 మంది విద్యార్థులు 100 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను, తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాల యాజమాన్యం పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ క్రాంతి కుమార్, కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'మే డేలో అందరూ పాల్గొనాలి'

తాంసి, ఏప్రిల్ 30: కార్మికులకు ఐక్యతగా నిలిచే మే డే కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కార్మిక సంఘం నాయకుడు తోట నరేందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన కార్మిక సంఘం నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని వర్గాలకు సంవత్సరంలో అనేక పండుగలు వస్తాయని, కానీ కార్మికులు మాత్రం మే డే ఒక్కటే నాన్న విషయాన్ని గమనించాలని కోరారు. ఉదయం 8గంటలకు తాంసిలో నిర్వహించే జెండా పండుగ కార్యక్రమంలో అన్ని కార్మిక సంఘాలు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అన్నదానం, పండ్లు, స్వీట్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రతీఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'ఓపెన్' పరీక్షలకు ఇద్దరు హాజరు

- విధుల్లో ఏడుగురు సిబ్బంది

ఉట్నూర్, ఏప్రిల్ 30: ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు హాజరు కాగా ఏడుగురు ఉద్యోగులు విధులు నిర్వహించారు. గత నెల 25 నుంచి ప్రారంభమైన ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గణితం పరీక్షను బోర్డు అధికారులు మంగళవారం మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహించగా ఇద్దరు విద్యార్థులు మాత్రమే హాజరు కాగా చీఫ్ సూపరింటెండెంట్ చౌహాన్‌శీతల్ రవీందర్‌నాయక్‌తో పాటు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, సిట్టింగ్ స్కార్డు, క్లర్క్, ఇన్విజిలేటర్, కానిస్టేబుల్‌తో పాటు ఏఎన్ఎంలు విధులు నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ కోఇన్‌చార్జీలు..

ఆదిలాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి కో ఇన్‌చార్జీలను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జీ దీపామున్షి మంగళవారం ఆదేశాలను జారీ చేశారు. ఆదిలాబాద్ కో ఇన్‌చార్జీలుగా మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, కాంగ్రెస్ సీనియర్ నేత నరేష్‌జాదవ్‌లను నియమిస్తూ ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్ ఎన్నికల వరకు ఈ ఇద్దరు నేతలు కో ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.

లీకేజీల 'భగీరథ'!!

బోథ్, ఏప్రిల్ 30: బోథ్ పట్టణంలో నీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీల కారణంగా నీరు వృథాగా పోతోంది. నీరంతా సమీపంలోని పంటపొలాల్లోకి పారుతుండటంతో నీరు వృథా అవుతోందని పలు కాలనీ వాసులు అంటున్నారు. అంతేగాక మండల కేంద్రంలోని పలు వార్డుల్లో ప్రతీరోజు ఏదో ఒకచోట మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడంతో గ్రామంలో నీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందంటున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రతీరోజు పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టాల్సి వస్తుందని వాపోతున్నారు.



బోథ్‌లోని మైసమ్మ గుడి వద్ద లీకేజీ అవుతున్న 'మిషన్ భగీరథ' పైప్‌లైన్

పదో తరగతి ఫలితాల్లో 17వ స్థానం

- రాష్ట్రవ్యాప్తంగా 92.93 శాతంతో మెరుగైన జిల్లా స్థానం
- ఈ సంవత్సరం కూడా బాలికలదే పైచేయి
- 10,374 మంది పరీక్షలు రాయగా.. 9,641 మంది ఉత్తీర్ణత
- సప్లిమెంటరీలో ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేస్తాం : జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 30: పదవ తరగతి పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లా గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మెరుగైన స్థానం సాధించడంతో పాటు ఉత్తీర్ణత శాతం మెరుగు పడింది. గత సంవత్సరం 19వ స్థానంలో నిలిచిన ఆదిలాబాద్ రాష్ట్రంలో 17వ స్థానంలో నిలిచింది. అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లా ఫర్వాలేదు అనిపించింది. మార్చిలో ప్రారంభమైన పరీక్షల్లో ఆదిలాబాద్‌లో 10,374 మంది పరీక్షలు రాయగా 9,641 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 4744, బాలికలు 4,897 మంది పాస్ అయ్యారు. ఈ సంవత్సరం కూడా బాలికలదే పైచేయి ఉంది. గత సంవత్సరం కంటే ఈ సారి ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించామని రాష్ట్ర వ్యాప్తంగా 92.93 శాతంతో 17 స్థానంలో ఉన్నామని డీఈవో ప్రణీత తెలిపారు. సప్లమెంటరీలో ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేస్తామన్నారు. జూన్‌లో సప్లిమెంటరీ పరీక్షలుంటాయని పేర్కొన్నారు.

- 'గిరిజన ఆశ్రమ పాఠశాలలో వంద శాతం ఫలితాలు'

ఉట్నూర్: జిల్లాలో ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ శాఖకు చెందిన 21 ఆశ్రమ పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాలు వంద శాతం సాధించడం జరిగిందని గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. జిల్లాలో 44 ఆశ్రమ పాఠశాలలతో పాటు మూడు వసతి గృహాలలో 1,591 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 1,514 మంది ఉత్తీర్ణుల్యారన్నారు. ఇంద్రవెల్లి, కేస్లాపూర్, మాడగూడ, సైదుపూర్, చందుపల్లి, జాతర్ల, పట్నాపూర్ వాన్వాట్, వడ్‌గావ్, ఝరిపూన్నగూడ, గాదిగూడ, బేల, అర్జుని, కోర్టికల్‌కె, ఝరి, తాంసి, నార్నూర్, కుంటాల, పార్టీ, చించుఘాట్, చించుదరి, ఖానాపూర్, ఆశ్రమ ఉన్నత పాఠశాలలు పదవ తరగతి ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిచాయన్నారు.

- పదిలో కేజీబీవీ బాలికల హవా

తలమడుగు: మండలంలోని సాయిలింగి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు పది పరీక్ష ఫలితాల్లో మరోసారి సత్తా చాటారు. మంగళవారం వెలువడిన పరీక్ష ఫలితాల్లో పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు పాసయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ తెలిపారు. మార్చిలో జరిగిన పరీక్షలో 26 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల కృషి పట్టుదల అధ్యాపకుల సహకారం విద్యార్థుల కృషితోనే ఫలితాలు సాధించడం జరిగిందని ప్రిన్సిపాల్ సువర్ణ పేర్కొన్నారు.



పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన సాయిలింగి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థులతో ప్రిన్సిపాల్ సువర్ణ

ఫలితాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కాగా వంద శాతం ఉత్తీర్ణత సాధించిన బాలికల పాఠశాల విద్యార్థులను అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామస్థులు అభినందించారు. కాగా ఐదుగురు విద్యార్థులు 9జీపీ సాధించారన్నారు. అలేఖ్య, వైష్ణవి, వరసిద్ధి, స్ఫూర్తి, శరణ్యలు, నైన్ జీపీ సాధించారని పేర్కొన్నారు. కాగా, మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన వెల్మహరి ప్రసాద్‌రెడ్డి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 10 జీపీ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, తాతయ్యల సహకారంతో పదిలో ఉత్తమ పలితాలు సాధించడం జరిగిందన్నారు. పదిలో హరిప్రసాద్‌రెడ్డి పదికి పది జీపీ సాధించడంతో ఆయనను తహసీల్దార్ సంధ్యారాణితో పాటు కజ్జర్ల గ్రామస్థులు అభినందించారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- జిల్లా ఎన్నికల అబ్జర్వర్ రాజేంద్ర విజయ్
- బోథ్ ఏఆర్‌వో కార్యాలయం, ఇచ్చోడలో పోలింగ్ కేంద్రం పరిశీలన



బోథ్‌లో సివిజిల్ కేంద్రంలో పరిశీలిస్తున్న జనరల్ అబ్జర్వర్



ఇచ్చోడలో సూచనలు చేస్తూ..

బోథ్, ఏప్రిల్ 30: నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లోని ఏఆర్‌వో కార్యాలయాన్ని జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాజేంద్ర విజయ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఆర్‌వో కార్యాలయంలోని సివిజిల్ సువిధ అకౌంటింగ్ టీం వివరాలను పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించాలని సూచించారు. అనంతరం ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించా. ఇందులో ఏఆర్‌వో అధికారి ఖుష్బుగుప్త, తహసీల్దార్ సుభాష్ చంద్ర, ప్రత్యేక ఎలక్షన్ డీటీ సూరజ్‌రావు, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తాంసిలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మి

- ఇచ్చోడ పోలింగ్ కేంద్రం..

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్న పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకుడు రాజేంద్ర విజయ్, ఏఆర్‌వో ఖుష్బుగుప్తతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలోని వసతులపై ఆరా ఎన్నికల అధికారులు తీశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక సిబ్బందికి వారు సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సమస్యలను గురించి ఈ సందర్భంగా ఆమె అడిగి తెలుసుకున్నారు. వారి వెంట తహసీల్దార్, తుకారాం, ఎంపీడీవో లక్ష్మణ్, డీటీ రామారావు, ఆర్ఐ హుస్సేన్, గ్రామ పంచాయతీ ఈవో సూర్యప్రకాష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

- తాంసిలో పోలింగ్ కేంద్రాల మార్పు

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల పాత భవనంలో ఇప్పటి వరకు పోలింగ్ కేంద్రాలను నిర్వహించేవారు. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో ఆ రెండు పోలింగ్ కేంద్రాలను కొత్త పాఠశాల భవనంలోకి మారుస్తున్నట్లు తహసీల్దార్ లక్ష్మీ తెలిపారు. మంగళవారం ఆమె ఆ గదులను పరిశీలించారు. ఈ కేంద్రాల్లో తాగునీటి వసతులతో పాటు నీడ, గాలి సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు.